క్లుప్తంగా

7 మద్యం బాటిళ్ల స్వాధీనం

బీచ్ రోడ్డు: ఓల్డ్ సీబీఐ జంక్షన్ వద్ద ఇద్దరి వ్యక్తులు అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు మూడో పట్టణ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఓల్డ్ సీబీఐ జంక్షన్‌లో ఇద్దరు అక్రమంగా మద్యాన్ని నిల్వ చేయడంతో పాటు అధిక ధరకు అమ్ముతున్నారని పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఆ ప్రాంతంలో దాడి చేయడంతో చుక్కా నిఖిల్, పల్లా శివ ప్రసాద్ వద్ద ఏడు మద్యం సీసాలు ఉండడం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

విద్యా హక్కు చట్టంపై సదస్సు రేపు

మద్దిలపాలెం : విద్యా హక్కు చట్టంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నామని రైట్ టూ ఎడ్యుకేషన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సును డాక్టర్ బుల్లయ్య కళాశాల ప్రాంగణంలోని గాంధీ సెంటర్‌లో నిర్వహించనున్నామని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు ఈ సదస్సులో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు 90324 77463 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు. ఏప్రిల్ 1వ తేదీతో చట్టం వచ్చి 15 ఏళ్ల అవుతున్న సందర్భంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

15.5 కిలోల గంజాయి స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితుడు

తాటిచెట్లపాలెం: గంజాయి తరలిస్తున్న ఒడిశా వాసిని విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ అనంత్‌రావు సిబ్బందితో కలిసి స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన సాహిల్ సింగ్ బ్యాగులను తనిఖీ చేయగా.. అందులో 15.5 కిలోల గంజాయి గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని.. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

28వ వార్డులో ప్రచారం



28వ వార్డులో ప్రచారం చేస్తున్న పల్లా దుర్గారావు

బీచ్ రోడ్డు: ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ సర్కారు ప్రతి ఇంటికి అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ జీవీఎంసీ 28వ వార్డులో పార్టీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు శుక్రవారం ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

చురుగ్గా షాదీఖానా పనులు

బీచ్ రోడ్డు: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ రూ.40 లక్షల ఎంపీ నిధులతో జీవీఎంసీ 22వ వార్డులో తారా మసీద్ వద్ద నిర్మిస్తున్న షాదీఖానా పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ పనులను శుక్రవారం పార్టీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

ప్రచారంలో వైఎస్సార్‌సీపీ దూకుడు

- ఎంపీ, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ విస్తృత ప్రచారం
- సహపంక్తి భోజనాలు.. భారీ చేరికలతో విశేష ఆదరణ
- అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్న జనం



వైఎస్సార్‌సీపీలో చేరిన పలు వార్డుల కాంగ్రెస్ పార్టీ నాయకులు



13వ వార్డు ఇఫ్తార్ విందులో ఎంవీవీ



18వ వార్డులో శుక్రవారం ప్రచారం చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: విశాఖ తూర్పు నియోజకవర్గంలో సాధారణ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ప్రస్తుతం విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎంవీవీ సత్యనారాయణ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగాను, ప్రస్తుతం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు. మరో వైపు వెలగపూడికి ఆ పార్టీ కార్యకర్తలే ప్రచారానికి సహకరించకుండా ముఖం చాటేస్తున్నారు. ఆయన ఏ వార్డుకు వెళ్లినా టీడీపీ నాయకులు వెంట లేక ప్రచారం వెలవెలబోతోంది. దీంతో వెలగపూడి లోలోపల మదనపడుతున్నారని ఆ పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఈసారి ఎలాగైనా నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలనే తపనతో ఎంవీవీ సత్యనారాయణ దూకుడు పెంచారు. ఇందులో భాగంగా నియోజకవర్గ పరిధిలోని 15 వార్డుల్లో ప్రచారం జోరుగా సాగిస్తున్నారు. కాలనీల్లో ప్రజలతో మమేకమవుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల వల్ల ఎలాంటి లబ్ధి చేకూరిందో అడిగి తెలుసుకుంటున్నారు. వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నారు. దీంతో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మహిళలు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్నారు. గడపగడపకు వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకుని, వారితో కలిసి సహ పంక్తి భోజనాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు రవీంద్రనగర్, ఇందిరానగర్, శాంతినగర్, ఎస్‌బీజీ నగర్‌తో పాటు జాలరిపేట ప్రాంతంలో పలు చోట్ల సహపంక్తి భోజనాలు చేశారు.

జోష్ పెంచిన సిద్ధం సభలు

వార్డుల్లో సచివాలయాల వారీగా ×మేము సిద్ధం మా బూతు సిద్ధం×పేరుతో నిర్వహిస్తున్న సభలు విజయవంతంగా సాగుతున్నాయి. ఇప్పటికి 10, 12, 13, 17, 18, 19 వార్డుల్లో ఈ సభలు నిర్వహించారు. వేలాది మంది జనం ఈ సభల్లో పాల్గొని వైఎస్సార్‌సీపీకి జై కొడుతున్నారు. సీఎం జగన్ సంక్షేమ పాలన తీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇఫ్తార్ విందు

రంజాన్ మాసం కావడంతో ముస్లింలు ఉపవాస దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఆరిలోవ, పెదవాల్తేరు, మద్దిలపాలెం ప్రాంతాలలో ఎంపీ పలు మసీదులను సందర్శించి ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందు చేస్తూ వారితో మమేకమయ్యారు.

చేరికల్లో ముందంజ

నియోజకవర్గంలో పలు వార్డుల నుంచి యువత, మహిళలు, ఇతర పార్టీలకు చెందినవారు వైఎస్సార్‌సీపీలో భారీగా చేరుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు ప్రకటిస్తున్నారు. ఇటీవల మద్దిలపాలెం, వాల్తేరు జాలరిపేట, ఆరిలోవ, హెచ్‌బీకాలనీ ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు.

18వ వార్డులో..

ఎంవీపీ కాలనీ: జనం కోసం.. జనంలోనే పేరిట ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ చేపట్టిన పాదయాత్ర శుక్రవారం 18వ వార్డులో కొనసాగింది. ఇందులో భాగంగా 75వ రోజు ఎంవీపీ కాలనీ సెక్టార్–2లో పార్టీ శ్రేణులతో కలిసి ఎంవీవీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌కు ఓటేసి తనను తూర్పు ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.

వాసవానిపాలెంలో సహపంక్తి భోజనం



19వ వార్డు వాసవానిపాలెంలో శుక్రవారం సహపంక్తి భోజనం చేస్తున్న ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ శుక్రవారం 19వ వార్డు వాసవానిపాలెంను సందర్శించారు. స్థానికంగా ఉన్న సమస్యలపై పలువురు గ్రామస్తులతో ముచ్చటించడంతో పాటు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని స్థానికులను ఆరా తీయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పేర్ల నల్లరాజు, సుశీల నివాసంలో గ్రామపెద్దలు, పార్టీ శ్రేణులతో కలిసి ఎంవీవీ సహపంక్తి భోజనం చేశారు.

వైఎస్సార్‌సీపీలోకి జనసేన యువకులు



జనసేన యువకులకు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జీవీ

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు కొనసాగుతున్నాయి. తాజాగా శుక్రవారం ఆరిలోవతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు జనసేన యువకులు వైఎస్సార్‌సీపీ నాయకుడు గంపల రామచంద్రరావు ఆధ్వర్యంలో జి.వెంకటేశ్వరరావు(జీవీ) సమక్షంలో పార్టీలో చేరారు. వారికి లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జీవీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ కష్టపడి పార్టీ కోసం పనిచేయాలని కోరారు. కష్టపడేవారికి పార్టీలో మంచి గౌరవం ఉంటుందని తెలిపారు.

కేవీల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం

తాటిచెట్లపాలెం : కేంద్రీయ విద్యాలయాల్లో బాలవాటిక, మొదటి తరగతి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్లు వాల్తేర్ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలవాటిక, మొదటి తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో వచ్చేనెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల మొదటి జాబితా ఏప్రిల్ 19న, మిగిలి ఉంటే రెండో జాబితా 29న, ఇంకా సీట్లు మిగిలి ఉంటే మే 8న ప్రకటిస్తామని తెలిపారు. 2 నుంచి 9వ తరగతి వరకు ఖాళీ సీట్ల భర్తీకి ఆఫ్‌లైన్‌లో వచ్చేనెల ఒకటి నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నామని పేర్కొన్నారు. తుది జాబితా 15న ప్రకటించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ వెబ్‌సైట్ http://kvsanghatan.nic.in/admission/లో చూడాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



బీచ్‌రోడ్డు ఎంజీఎం పార్కులో పాల్గొన్న భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న బ్రదర్ కర్మోజీ



హెచ్‌బీ కాలనీలో ఏసుక్రీస్తును కీర్తిస్తూ ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు



ఆర్‌సీఎం చర్చిలో అలంకరించిన ఏసుక్రీస్తు పందిరి



ఆరిలోవ లీలాసుందరినగర్ ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఆరిలోవ: క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడేని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చర్చిల్లో ప్రత్యేక పందిళ్ల వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. ఏసుక్రీస్తు చిత్రపటాలు ఏర్పాటు చేసి ప్రార్థనలు చేశారు. ఆరిలోవ కాలనీ, బాలాజీనగర్, రవీంద్రనగర్, ఇందిరానగర్, పెదగదిలి, చినగదిలి, రామకృష్ణాపురం, పైనాపిల్ కాలనీ, విశాలాక్షినగర్, హనుమంతవాక ప్రాంతాల్లోని చర్చిల్లో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. ఆరిలోవ లీలాసుందరినగర్‌లో నిత్య సహాయ మాత ఆర్‌సీఎం చర్చిని అలంకరించారు. ఏసుక్రీస్తు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ప్రార్థనలు చేశారు. చర్చిలో కంటకాపల్లి ధ్యాన కేంద్రనాకి చెందిన ఫాదర్ మరియదాస్, ఫాదర్ జోసెఫ్ అనితోటం, డెకన్ బ్రదర్స్ పాల్గొని భక్తులతో ప్రార్థనలు చేయించారు.

బీచ్ రోడ్డు: గుడ్ ఫ్రైడే ఆరాధన కార్యక్రమాన్ని క్రైస్తవ భక్తులు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. బీచ్ రోడ్డు ఎంజీఎం పార్కులో శామ్యూల్ కర్మోజీ మినిస్ట్రీస్, మీరాకిల్ సెంటర్ చర్చి ఏర్పాటు చేసిన గుడ్ ఫ్రైడే ఆరాధనలో అంతర్జాతీయ ప్రసంగికుడు బ్రదర్ శామ్యూల్ కర్మోజీ ఏసుక్రీస్తు మరణ దిన వృత్తాంతాన్ని వివరించారు. శిలువలో ఏసు పలికిన ఏడు మాటలను విపులీకరించారు.

మద్దిలపాలెం : గుడ్‌ఫ్రైడే సందర్భంగా హెచ్‌బీ కాలనీలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కొండవాలు ప్రాంతాలతో పాటు, మద్దిలపాలెం, రామాటాకీస్ ప్రాంతాల్లోని చర్చిల సభ్యులు ఏసుక్రీస్తును కీర్తిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు.

జూలో ప్రత్యేక వసతులు



జూలో ఆస్ట్రిచ్ ఎదురుగా మర్రిచెట్టు కింద ఏర్పాటు చేసిన షెడ్



చెట్ల నీడలో ఏర్పాటు చేసిన వెదురు కర్రల బెంచీలు



జూ కొలను వద్ద గడ్డితో ఏర్పాటు చేసిన షెల్టర్

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో సందర్శకుల కోసం అధికారులు ఇటీవల పలు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. జూలో సందర్శకులు విశ్రాంతి కోసం ఇప్పటికే రేకుల షెడ్లు, వాటిలో సిమెంట్ బెంచీలు, చెట్ల కింద రచ్చబండలు నిర్మించారు. ఇప్పుడు పర్యావరణ పరిరక్షణలో భాగంగా గడ్డితో ఏర్పాటు చేసిన విశ్రాంతి షెడ్లు, వెదురుతో తయారు చేసిన బెంచీలు అమర్చారు. ఆస్ట్రిచ్ ఎదురుగా పెద్ద మర్రిచెట్టు కింద రచ్చబండ నిర్మించి దానిపై తాటి కర్రలపై గడ్డితో పైకప్పు వేసిన షెడ్ ఏర్పాటు చేశారు. దీంతో పాటు కొలను ఒడ్డున విశాలమైన స్థలంలో మరో షెడ్ నిర్మించారు. ఆయా షెడ్లలో వెదురు కర్రలతో తయారుచేసిన బెంచీలు అమర్చారు. వీటితో పాటు పలుచోట్ల చెట్ల నీడలో వెదురుతో చేసిన బెంచీలను ఏర్పాటు చేశారు. ఆయా చోట్ల సందర్శకులు సేదదీరుతున్నారు. ఇక్కడ వెదురు, గడ్డితో తయారుచేసిన బెంచీలు, షెడ్‌లు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి.

పంచాయతీ కాలనీలో చోరీ

ఏడు తులాల బంగారం అపహరణ

సింహాచలం: తాళం వేసిన ఇంట్లోకి దొంగలు చొరబడి ఏడు తులాల బంగారం, 150 గ్రాముల వెండి దొంగిలించారు. వివరాలు.. జీవీఎంసీ 98వవార్డు అప్పన్నపాలెం నుంచి భరత్‌నగర్‌కి వెళ్లే మార్గంలో ఉన్న పంచాయతీ కాలనీలో రిటైర్డ్ ఎంఈఎస్ ఉద్యోగి వీవీఎన్ ఆచార్యులు భార్య కామేశ్వరితో కలిసి నివసిస్తున్నారు. ఈనెల 21న ఇంటికి తాళం వేసి కాశీ వెళ్లారు. తిరిగి ఈనెల 28న సాయంత్రం విశాఖ వచ్చి గాజువాకలో ఉంటున్న కొడుకు ఇంటికి వెళ్లారు. ఇదిలా వుండగా గురువారం రాత్రి ఇంటి గోడ దూకి తలుపు గ్రిల్, తాళం విరగ్గొట్టి లోపలకు దొంగలు ప్రవేశించారు. బెడ్‌రూమ్‌లోని బీరువాలో ఉన్న ఏడు తులాల బంగారం, 150 గ్రాముల వెండి దొంగిలించుకుపోయారు. కాగా ఇంటి రెండోవైపు తలుపు తెరిచి ఉండడంతో పక్కింటిమేడపై ఉన్నవారు చూసి గాజువాకలో ఉన్న ఆచార్యులకు సమాచారం అందించారు. ఇంటికి వచ్చిన ఆచార్యులు దొంగతనం జరిగిందని పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం డీసీపీ రత్నం చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. క్రైం సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ డి.సూర్యనారాయణ స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



డైమండ్ పార్కు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సీతమ్మధార : ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు డైమండ్ పార్కు వద్ద శుక్రవారం ఉదయం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కార్లు, ఆటోలను క్షుణ్ణంగా తనిఖీ చేసి.. ఎక్కడి నుంచి వస్తున్నారు.. ఎక్కడికి వెళ్తున్నారని వాహన చోదకులను ప్రశ్నించారు. ప్రతి వాహనం నంబర్ రాసుకున్నారు. స్పెషల్ ఫోర్స్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ ఏఎస్‌ఐతో పాటు సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

తూనిక యంత్రాల పరిశీలన



తూనిక యంత్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ రామారావు

సీతంపేట: నరసింహనగర్ రైతుబజార్‌లో శుక్రవారం ఉదయం తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ వి.రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కాటాలకు సీళ్లు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఆరు కాటాలకు సీళ్లు లేనట్టు గుర్తించి వాటికి సీళ్లు వేశారు. వినియోజదారులకు తూకంలో తేడా ఉన్నట్టు అనుమానాలు ఉంటే ధర్మకాటాలో తూకం వేసి సరిచూసుకోవాలని తెలిపారు. వినియోగదారులు తాము కొనుగోలు చేసిన కూరగాయలు ధర్మకాటాలో తూకం వేసి చూసుకున్నారు. కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ చినబాబు, సహాయకుడు సర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల అభివృద్ధి కాంక్షించే వ్యక్తి సీఎం జగన్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ



సిద్ధం సభలో పాల్గొన్న ప్రజలు

ఆరిలోవ: ప్రజల అభివృద్ధి కాంక్షించే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 11వ వార్డులో శుక్రవారం మేము సిద్ధం–మా బూతు సిద్ధం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలు అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. చంద్రబాబు మాత్రం ప్రజల వినాశనం కోరుకుంటున్నారన్నారు. పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం చదువును చంద్రబాబు వద్దంటున్నారని, ప్రజలు ఈ విషయాన్ని గ్రహించాలని సూచించారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వెలగపూడి రామకృష్ణబాబు ఆరిలోవకు ఏం చేశారని ప్రశ్నించారు. కాపు సామాజిక నాయకుడు వంగవీటి రంగాను హత్య చేసి విజయవాడ నుంచి విశాఖకు పారిపోయి వచ్చిన వ్యక్తి వెలగపూడి అని ఆరోపించారు. ఆయనది అంతా నేర చరిత్రేనని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆరిలోవ ప్రాంతాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అభివృద్ధి చేశారని తెలిపారు. విశాలమైన రోడ్లు, గెడ్డలు ఆధునీకరణ చేశామన్నారు. ముఖ్యమంత్రి అమలు చేసిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించామన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ విశాఖలో తనను ఎంపీగాను, ఎంవీవీని ఎమ్మెల్యేగా గెలిపించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని ప్రజలను కోరారు. ఆరిలోవ ప్రాంతం 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అయిన తర్వాత నుంచి అభివృద్ధి చెందిందన్నారు. హెల్త్‌సిటీ, బీఆర్‌టీఎస్ రోడ్లు నిర్మించారన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మళ్లీ ఆరిలోవ ప్రాంతం మరింత అభివృద్ధి సాధించిందన్నారు. ప్రజలు ఆలోచించి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నాయకుడు గొలగాని శ్రీనివాస్, ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, నగరాల డైరెక్టర్ కె.మోహనరావు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై అప్పన్న తిరువీధి

పరవశించిన భక్తజనం



సూర్యప్రభ వాహనంపై తిరువీధిలో అప్పన్న



కోలాటం ఆడుతున్న మహిళలు

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో భాగంగా శుక్రవారం సాయంత్రం స్వామికి సూర్యప్రభ వాహనంపై తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవిలను ముస్తాబు చేసి సూర్యప్రభ వాహనంపై అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధిని వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని పులకించిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు, రుత్వికులు, పారాయణదారులు పాల్గొన్నారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కనకమహాలక్ష్మికి ఘనంగా క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.